ఆరు కాదు.. మూడు రోజులే..

'సీసీఐ' పత్తి కొనేది అంతే..

- అధికారుల నిర్లక్ష్యం.. రైతాంగానికి శాపం
- చేసేదీ లేక తక్కువ ధరకు 'ప్రైవేట్'కు అమ్మకం
- మార్కెట్‌లో దళారుల రాజ్యం
- వాళ్లు చెప్పిన రేటే ఫైనల్

పత్తిని అమ్మకానికి తీసుకువచ్చి క్యూలో ట్రాక్టర్‌పై పడుకున్న డ్రైవర్

జిన్నింగ్ వద్ద క్యూలో ఉన్న పత్తి వాహనాలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25: పత్తి పంట సాగు చేయడం కత్తి మీద సాములాంటింది. అధిక వర్షం పడ్డా, వర్షాలు రాకపోయినా దేవుడిపై భారం వేసి సాగు చేయడం తప్ప రైతులు చేయాల్సింది ఏమీ లేదు. పంట పండించడం ఒక్క ఎత్తయితే, దాన్ని అమ్మడం నరకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం సీసీఐ ద్వారా కాటన్ కొనుగోళ్లు చేపడుతున్నది. గిట్టుబాటు ధర రూ. 7020తో కొంటున్నది. ఇందులో పత్తి నాణ్యతను బట్టి ధర కల్పించడంతో రైతులు తీసుకువచ్చిన పత్తిలో మైచార్ అత్యధికంగా ఉందన్న సాకుతో అధికారులు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే వారంలో మూడు రోజుల మాత్రమే పత్తి కొంటుండడంతో, రైతులు పత్తి వాహనాలతో మిగతా రోజులు వేచి చూడాల్సి వస్తున్నది. గతంలో ప్రతిరోజు 150 టోకెన్లు ఇచ్చే అధికారులు ఇప్పుడు 50 నుంచి 100 టోకెన్లు మాత్రమే ఇస్తుండడంతో మరింత ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఇక రెండు, మూడు రోజులు వేచి చూడలేక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు పత్తిని అమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంలో ఆరు రోజులు పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సీసీఐ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తాము నష్టపోవాల్సి వస్తున్నదని ఆరోపిస్తున్నారు. పత్తి సకాలంలో దించకపోవడంతో వాహనాల కిరాయి పెరుగుతున్నదని చెబుతున్నారు. దళారులకు మేలు చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. సీసీఐ అధికారులు మాత్రం పత్తి నిల్వలు ఎక్కువగా ఉండడం, జిన్నింగ్ మిల్లులో స్థలం లేకపోవడంతోనే మూడు రోజులే కొంటున్నామని చెబుతున్నారు. ఈ ఏడాది మార్కెట్ ఫీజు దాదాపుగా రూ. 6.11 కోట్లు సేకరించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 4 కోట్లు మాత్రమే ఫీజు వసూలు చేసినట్లు సమాచారం. ఇక రైతుల నుంచి కొన్న పత్తిని ప్రైవేట్ వ్యాపారులు నేరుగా సీసీఐకి అమ్ముతున్నారని ఆరోపణలు లేకపోలేదు. దళారులు తీసుకువచ్చిన పత్తికి గిట్టుబాటు ధరలోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిన్నింగ్ మిల్లు సిబ్బంది అన్నితామై చూసుకుంటున్నట్లు సమాచారం.

రైతులకు న్యాయం చేయాలి

సీసీఐ అధికారులు రైతులకు అన్యాయం చేస్తున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్మడానికి కష్టంగా మారింది. రెండ్లేళ్ల పంట దిగుబడి రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధర కూడా తక్కువగా ఉండడంతో అప్పుల పాలవుతున్నాం.అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

-జైతు,సమతులగుండం, ఆసిఫాబాద్

ఆరు రోజులూ కొనాలి

ఎంతో దూరం నుంచి పత్తి అమ్మడానికి తీసుకువచ్చిన. ఇక్కడ ప్రతి రోజూ 50 నుంచి 100 టోకెన్లు మాత్రమే ఇ స్తున్నరు. కానీ రోజూ వందల సంఖ్యలో వాహనాలు వ స్తున్నాయి. వారంలో మూడు రోజులే అధికారులు కొం టున్నరు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. ఏమీ చేయలేని పరిస్థితిలో దళారులకు అమ్మకుంటు న్నం. వారంలో ఆరు రోజులు సీసీఐ ద్వారా పత్తి కొనాలి.

-తిరుపతి,అంద్దెల్లి,కాగజ్‌నగర్

పలు రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత

తాండూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు స్పష్టం చేశారు. థర్డ్ లైన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మార్చి 12వ తేదీ వరకు రేచిని రోడ్ లోని రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్‌లు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

టీయూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

నియామక పత్రం అందజేస్తున్న టీయూటీఎఫ్ జిల్లా కోశాధికారి వెంకట్‌రావు

తిర్యాణి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని కుమ్రంభీం కమ్యూనిటీ హాలులో ఆదివారం టీయూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీయూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు గేడాం జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. టీయూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా ఆత్రం దేవ్‌షా,అధ్యక్షులుగా బొమ్మెన భరత్‌చంద్ర యాదవ్, సహాధ్యక్షులుగా సిడాం శ్రీలత, జూల రజినీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కోట్నాక ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కోట్నాక విజయ్ కుమార్, పెందూర్ గంగారాం, కార్యదర్శులుగా నైతం లావణ్య, నైతం లచ్చు, కోశాధికారిగా ఆత్రం సందీప్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ దోందేరావు, సభ్యులు ఏదుల శంకరమ్మ, టేకం రామారావు, జిల్లా కౌన్సిల్ ప్రతినిధులుగా గేడాం జనార్దన్ ఆత్రం జగ్గారావులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు టీయూటీఎఫ్ జిల్లా కోశాధికారి కిల్లి వెంకట్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించినట్లు తెలిపారు.

నేడు జిల్లా కేంద్రంలో మెగా జాబ్ మేళా

తిర్యాణి, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎస్ఐ రమేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు 50 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్,ఎంటెక్, ఫార్మసీ పూర్తి చేసిన యువత ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఒరిజినల్, జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని సూచించారు.

హామీలన్నీ అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి తుడుం దెబ్బ నాయకుల డిమాండ్

మాట్లాడుతున్న తుడుందెబ్బ మండలాధ్యక్షుడు భాస్కర్, నాయకులు

తిర్యాణి, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాష్, మండలాధ్యక్షుడు తోడసం భాస్కర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అనేక హామీలిచ్చి గెలుపొందారని, పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సర్కారులో రైతులందరికీ రైతుబంధు డబ్బులు నిర్ణీత సమయంలో ఖాతాల్లో జమ చేసేవారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడెకరాల్లోపు భూములున్న వారికే రైతుబంధు డబ్బు లిస్తూ చేతులు దులుపుకుందన్నారు. వంట గ్యాస్,ఉచిత విద్యుత్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్లను పూర్తి చేయాలని కోరారు. ఆదివాసీ నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని, నూతన సిలబస్‌ను ప్రవేశపెట్టాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిలదీత కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కోట్నాక గణపతి, ప్రధాన కార్యదర్శి రాయిసిడాం వినోద్ ఉన్నారు.

రేపు వేలం

రెబ్బెన, ఫిబ్రవరి 25: మహాశివరాత్రిని పురస్కరించుకొని రెబ్బెన మండలం నంబాల గ్రామ శివారులో కొలువైన శ్రీ ప్రసన్న పరమేశ్వరాలయం ఆవరణలో మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్, పార్కింగ్, కొబ్బరికాయలు, ప్రసాదం నిర్వహణ కోసం వేలం ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు హాజరవ్వాలని కోరారు.

ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం

మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కౌటాల, ఫిబ్రవరి 23: జీవో 317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదే శివాజీ అన్నారు. ఆదివారం ఎమ్మార్సీ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రి శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లను సంఘం సభ్యులగా చేర్చి ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, ఉపాధ్యక్షుడు బండి శేఖర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి సునీల్ ఉన్నారు..

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

కౌటాల, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లోని చీపురుదుబ్బ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు ఫీడర్‌లోని గురుడుపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కనికి, యాపలగూడ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ రవీందర్ ఆదివారం ఒక ప్రటకనలో తెలిపారు. కావున ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంలోని ఉత్తరవాహిని నదీ తీరాన కొలువుదీరిన అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించడం జరుగుతుందని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం నవగ్రహ సహిత గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతులపై కాల్పులు హేయమైన చర్య : ఏఐటీయూసీ

తిర్యాణి,ఫిబ్రవరి 25 : దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వం, రైతులు కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించ లేదా అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగం మొగిళీగౌడ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పంజాబ్-హర్యాన సరిహద్దుల్లో సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కాల్పులు జరిపించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కినక జంగు,అట్కపురం సత్తయ్య, దేవేందర్, రవి, రాజు పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరం ప్రారంభం

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ విక్రమ్

బెజ్జూర్, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలో సర్గీయ కోండ్ర బుచ్చమ్మ, కోండ్ర హనుమాగౌడ్ జ్ఞాపకార్థం మంచిర్యాల 'న్యూ పవన్ ఆప్టికల్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరాన్ని ఆదివారం ఎస్ఐ విక్రమ్ ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారి కోసం శిబిరం ఏర్పాటు చేయడంపై ఆయన కోండ్ర పరివార్ సభ్యులను అభినందించారు. ఈ శిబిరాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాని సూచించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్, డాక్టర్ గోపికృష్ణ రోగులకు కంటి పరీక్షలు చేశారు. మొత్తం 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమున్న వారిని రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కోండ్ర పరివార్ సభ్యుడు, మాజీ ఎంపీపీ కోండ్ర మనోహర్ గౌడ్, మాజీ సర్పంచ్ కోండ్ర జగ్గాగౌడ్, కోండ్ర సురేశ్ గౌడ్, కోండ్ర నరేందర్‌గౌడ్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, నాయకులు జావీద్ అలీఖాన్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

సింగరేణి

కార్మికులకు ప్రమాద బీమా రూ.కోటి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25 : గని ప్రమాదంలోగాని, ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా(ఎక్స్‌గ్రేషియా) చెల్లించడానికి సింగరేణి యాజమాన్యంతో యూనియన్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల యాజమాన్యాలతో ఒప్పందం కుదిరిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ కృషి ఫలితంగా కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూనియన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఎస్ఆర్పీ-3 గనిలో నలుగురు కార్మికులు మృతి చెందినప్పుడు కూడా కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేయగా రూ.70 లక్షలు చెల్లించేందుకు బ్యాంకుల యాజమాన్యాలు అంగీకరించాయని చెప్పారు. అందులో భాగంగానే ఆసిఫాబాద్ వాగులో రెస్క్యూ సిబ్బంది ఇద్దరు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు రూ.70 లక్షలు చెల్లించారని చెప్పారు. అప్పటి నుంచి తమ యూనియన్ బ్యాంకుల యాజమాన్యాలను కోటి ప్రమాద బీమాకు డిమాండ్ చేసినట్లు చెప్పారు. కార్మికులు మరో రూ.274 చెల్లిస్తే 1.30 కోట్ల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఎస్‌బీఐ యాజమాన్యం కూడా ఈ ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కోటి ప్రమాద బీమా చెల్లించే బ్యాంకులకు వారి వేతనాలు మార్చుకుంటారని చెప్పారు.

కార్మికుల హక్కులు కోసం కృషి

- ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25 : సింగరేణిలో కార్మికులు గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపించక పోయినా, ప్రాతినిధ్య కార్మిక సంఘంగా తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీ జనక్‌ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం, సీఅండ్‌ఎండీ, మంత్రులకు సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమ వసతులు, సంస్థ అభివృద్ధికి 25 అంశాలపై విజ్ఞప్తి చేశారని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాం, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతూ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా ఉద్యోగ నియామకాలివ్వకుండా పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలిపారు. గోదావరిఖనిలో రూ.25 కోట్లతో కార్మిక కుటుంబాలకు శుద్ధ జలాల సరఫరాకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్మికుల చిరకాల కోరిక 250 గజాల ఇంటి స్థలం ఇప్పించేందుకు డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్కను జనక్‌ప్రసాద్ కలిసి విజ్ఞప్తి మేరకు వెంటనే రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు, సింగరేణి యాజమాన్యానికి సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు పరిశీలించి ఇవ్వడానికి ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారని చెప్పారు. జైపూర్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కార్మికులకు సంబంధించి 25 అంశాలపై ప్రభుత్వానికి, సింగరేణికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అనంతరం ఉత్తమ కార్మికుడిగా అవార్డు అందుకున్న జంగం మధును నాయకులు శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, కేంద్ర నాయకులు తిరుపతిరాజు, వంలకుమారస్వామి, నీలం సదయ్య, జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు పెంట శ్రీనివాస్, మల్లేశ్, ఎంబడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 25 : ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించడం, కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం ద్వారా, ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల విషయంలో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఏ వెంకట్, వీ శాంతకుమారి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్ల రామన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు మంజూరు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, సమగ్ర శిక్ష కేజీబీవీ, యూఆర్ఎస్, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, బీసీ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్ తదితర సిబ్బందికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ రెగ్యులరైజ్ చేయాలని, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు, ఉపాధ్యక్షులు చక్రపాణి, లావణ్య, కోశాధికారి కిరణ్, కార్యదర్శులు నర్సయ్య, చంద్రమౌళి, సంతోష్ కుమార్, కిరణ్ కుమార్, బబిత, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జన్నారం, ఫిబ్రవరి 25 : మండలంలోని కలమడుగు గ్రామంలో నరనారాయణస్వామి ఆలయ 39వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం నరనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు తాళ్లతో లాగుతూ పుర వీధుల గుండా ఊరేగించారు. వాడలన్నీ నరనారాయణస్వామి నామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదగిరి స్వదేశరావు, యాదగిరి శేఖర్‌రావు, కైరం కిషన్‌గౌడ్, శ్రీనివాస్, కాకర నర్సయ్య, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మకు మొక్కులు..

గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని డబ్బా గ్రామంలో ఎక్స్‌రోడ్ సమీపంలోని ఆదివారం గద్దెలపై సమ్మక్క-సారలమ్మలు కొలువుదీరారు. దేవతలను దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, బోనాలు పోసి నైవేద్యాలు పెట్టి, ఒడి బియ్యం, ముడుపులు సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి



ఆసిఫాబాద్ : మాట్లాడుతున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో సోమవారం నిర్వహించే సంత్‌సేవాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం కార్యక్రమ స్థలం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని బంజారలతో పాటు వివిధ సంఘాల నేతలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు.కమిటీ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఇందులాల్, రవీందర్, శివారం, పున్నందాస్, అంబారావు, ప్రేమ్, సుభాష్, క్రిష్టనాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ జయంతి

లింగాపూర్,ఫిబ్రవరి 25 : మండలకేంద్రంలో సోమవారం నిర్వహించనున్న లంబాడా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లంబాడా గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం అధికారికంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని తాండాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311956-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677